క్లుప్తంగా

నేడు విద్యుత్ అదాలత్

పులివెందుల రూరల్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల డివిజన్ పరిధిలోని పులివెందుల టౌన్, రూరల్, వేంపల్లె సబ్‌డివిజనల్‌కు సంబంధించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది విద్యుత్ అదాలత్‌కు హాజరవుతున్నారు. పులివెందుల డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వ్రాత పూర్వకంగా తెలియజేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంబకపల్లె రోడ్డులోని మినీ సెక్రటేరియట్‌లో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలు మృతి


చెప్పలి సుభాషిణి(ఫైల్)

కమలాపురం : వందలాది మందికి విద్యాబుద్ధులు నేర్పిన మహనీయురాలు విశ్రాంత ఉపాధ్యాయురాలు చెప్పలి సుభాషిణి మృతి చాలా బాధకరం అని, ఆమె మృతి కమలాపురం ప్రాంతానికి తీరనిలోటు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ తెలిపారు. ఆమె గత కొంత కాలంగా హైద్రాబాద్‌లో నివసిస్తున్నారని, బుధవారం స్వర్గస్తులయ్యారని తెలుసుకున్న సాయినాథశర్మ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళలర్పించారు. సుభాషిణి 35 ఏళ్ల పాటు కమలాపురంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయినిగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా విధులు నిర్వర్తించి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సాయినాథశర్మ ప్రార్థించారు.

కోనమల్లేశ్వర స్వామిని దర్శించుకున్న జేసీ


ఆలయంలో పూజలు చేస్తున్న జేసీ గణేష్‌కుమార్

లింగాల : పార్నపల్లె గ్రామ సమీపంలో వెలసిన కోనమల్లేశ్వరస్వామిని గురువారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ దర్శించుకున్నారు. వేదపండితులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సీబీఆర్‌పై పర్యటించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు, పులివెందుల, లింగాల ఎమ్మార్వోలు రమేష్, రాము, ఆర్ఐ సురేంద్ర, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను ప్రభుత్వం కొనసాగించాలి

జమ్మలమడుగు : ప్రజలకు అందుబాటులో ఉన్న వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని రాజీనామా చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షుడు ప్రసాద్ కోరారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్‌లను విధుల్లోకి తీసుకుని వారికి కనీస వేతనం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలకోడ్ వచ్చిన తర్వాత నుంచి వలంటీర్‌లకు ఎటువంటి పనులు అప్పగించలేదు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వలంటీర్‌లను కొనసాగించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వలంటీర్ వ్యవస్థలను కొనసాగించడంతోపాటు వారికి పదివేల రూపాయలు జీతం ఇస్తామని ఎన్నికల ముందు హామి ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీలను నిలబెట్టుకోవాలన్నారు.

నోట్‌పుస్తకాలు పంపిణీ

లింగాల : మండలంలోని కామసముద్రం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సచివాలయ సిబ్బంది నాగానాయక్ విద్యార్థులకు చేతివ్రాత నైపుణ్యాభివృద్ధి కోసం కాపీరైటింగ్ నోట్ పుస్తకాలను వితరణగా అందజేశారు.

మూత్ర విసర్జన చేయవద్దన్నందుకు దౌర్జన్యం

కొండాపురం : స్థానిక సచివాలయం వద్ద ఇళ్ల సమీపంలో మూత్ర విసర్జన చేయవద్దన్నందుకు మహిళను ఓ వ్యక్తి కొట్టినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. కొండాపురం గ్రామ సచివాలయం ఆవరణలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయం వద్దకు టి.కోడూరు గ్రామానికి చెందిన వ్యక్తి వచ్చాడు. గృహాల మధ్యలో మూత్ర విసర్జన చేస్తుండగా వారించినందుకు వెల్లాల విజలయలక్ష్మి ఇంటిపై దౌర్జన్యం చేసి ఇంటి అద్దాలు పగులగొట్టి ఆమెపై దాడి చేసినట్లు ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన భగవత్ పఠనం

సింహాద్రిపురం : మండలంలోని కసనూరు శివాలయంలో నిర్వహిస్తున్న భగవత్ పఠనం గురువారంతో ముగిసింది. పులివెందుల భాగవత భక్తసమాజం వారిచే వారం రోజులుగా భాగవత సప్తహ పఠనం నిర్వహిస్తున్నారు.

పత్తిలో రసంపీల్చే పురుగులను నివారించండి


వేముల : గొందిపల్లె గ్రామంలో తెగుళ్లు సోకిన పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి


కమలాపురం : టి.చదిపిరాళ్ల వద్ద మినుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి


వీఎన్‌పల్లె : వేరుశనగ పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వేముల : పత్తి పంటలో రసం పీల్చే పురుగులను నివారించుకోవాలని పులివెందుల ఏడీఏ కార్యాలయ ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం సాక్షిలో పత్తిపంటను చుట్టుముట్టిన తెగుళ్లు అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు ఏఓ గురువారం మండలంలోని గొందిపల్లె గ్రామంలో రైతులు సాగుచేసిన పత్తిపంటను పరిశీలించి మాట్లాడారు. వేసవి పంటగా పత్తి పంటను రైతులు విస్తారంగా సాగుచేశారన్నారు. ప్రస్తుతం పత్తి పంట 80-90 రోజుల దశలో ఉందన్నారు. వాతావరణ పరిస్థితులు, బెట్టపరిస్థితులు, పొడి వాతావరణం ఉండటం వల్ల రసం పీల్చే పురుగులైన తామర పురుగులు, నల్లి, పచ్చదోమ, తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. వీటిని నివారిస్తేనే సాగులో దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఇందుకోసం థైమోమితాక్సామ్ 0.4 గ్రాములు లీటరు నీటికి లేదా పిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటితోనూ లేదా డైతెంతురాన్ 2 గ్రాములు లీటరు నీటికి లేదా క్లోనికామిడ్ 0.4 గ్రాములు లీటరు నీటికి లేదా టోల్‌ఫెనో పైరాడ్ 2 మి.లీ లీటరు నీటితోనూ మందులను అవసరం మేరకు ఒకటి తర్వాత ఒకటి పిచికారీ చేయడం ద్వారా రసంపీల్చే పురుగులను నివారించుకోవచ్చన్నారు. అంతేకాక పైరు దశలో మిగ్నీషియం ఆవశ్యకత కూడా ఉందని, మందులను పిచికారీ చేసేటప్పుడు మెగ్నీషియం సల్ఫేట్‌ను 10 గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వీటిని సకాలంలో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు క్రమం తప్పకుండా పాటిస్తే దిగుబడులు బాగుంటాయని సూచించారు. రైతుభరోసా కేంద్రం వీఏఏ లక్ష్మి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కమలాపురం : మినుము పంటకు పురుగు ఆశించిందని, సస్యరక్షణ చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుందని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండల పరిధిలోని టి.చదిపిరాళ్ల గ్రామంలో సాగు చేసిన మినుము పంటను పరిశీలించారు. ఈ పంటకు రబ్బరు పురుగు, తెల్లదోమ, పచ్చదోమ, పురుగులు నష్టం కలుగజేస్తున్నాయని వివరించారు. వాటి నివారణకు 2.5 మి.లీ. క్లోరోఫైరిఫాస్ లేదా 1.5 గ్రాముల అసిఫేట్, 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు అయితే 0.4 గ్రాముల ఏమమెక్టిన్ బెంజోయేట్, 5 గ్రాముల 19:19:19 ఎరువును లీటర్ నీటికి పిచికారి చేయాలన్నారు. తెల్లదోమ, పచ్చదోమ నివారణకు 0.3 గ్రాముల అసిటామిప్రిడ్ లేదా 0.3 మి.లీ. ఇమిడా క్లోప్రిడ్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏ మమత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం సాగులో ఉన్న వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. గురువారం వీరపునాయునిపల్లె, అనిమెల గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంటను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేరుశనగ పంటలో లద్దెపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. తల్లి పురుగులు లేత గోదుమ రంగులో ఉండి ఆకుల పైభాగాన, కింది భాగాన నూగుతో కప్పి గుడ్లు పెడతాయన్నారు. పిల్ల పురుగులు గుంపులు గుంపులుగా చేరి ఆకుల పైన పత్రహరితాన్ని తినేసి జల్లెడగా మారుస్తాయని ఎదిగిన పురుగులు ఆకులను తినేస్తాయన్నారు. పగటి సమయంలో చెట్ల అడుగుభాగాన మరియు మల్లి పెళ్లలు, గులక రాళ్ల అడుగుభాగాన దాగి ఉండి రాత్రి సమయంలో పంటపై ఆశించి ఆకులను పూర్తిగా తినేస్తాయన్నారు. వీటి నివారణకు థయోడికార్బ్ 20 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లి. మందును లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదరికంపై యుద్ధానికి చదువే ఆయుధం


విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

కమలాపురం : పేదరికంపై యుద్ధానికి చదువే ఆయుధం అని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. మండలంలో టెన్త్ క్లాస్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఎల్లారెడ్డిపల్లెకు చెందిన పుత్తా ఎల్లారెడ్డి తన కుమారుడు స్వర్గీయ పుత్తా మారుతి మోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం నగదు బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. 2024 మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలో కమలాపురం జడ్పీ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన అబ్దుల్ రెహమాన్, నల్లింగాయపల్లెకు హైస్కూల్‌కు చెందిన సింధుజ లు 570 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. వారికి రూ.5,500 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అలాగే గురుకుల పాఠశాలకు చెందిన వెన్నెల, అనూషలకు 566 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. వారికి రూ.5వేల చొప్పు న నగదు అందజేశారు. అలాగే నల్లింగాయపల్లె హైస్కూల్‌కు చెందిన జగన్ 564 మార్కులతో తృతీ య స్థానంలో నిలిచాడు. అతడికి రూ.4,500 నగదు బహుమతి అందజేశారు.

నేడు ఉచితంగా రేబిస్ టీకాలు

జమ్మలమడుగు : పశుసంవర్ధక ప్రాంతీయ పశువైద్యశాలలో ఉచితంగా కుక్కలకు రేబిస్ టీకాలను వేస్తారని ఏడీ శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 6వ తేదీ ప్రపంచ జోఓటీస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక పశువైద్యశాలల్లో కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలను వేస్తారన్నారు.

హోటళ్లలో కల్తీలేని ఆహారాన్ని అందించాలి


హోటళ్లలోని ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న కమిషనర్ రమణారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని హోటళ్లలో కల్తీలేని ఆహారాన్ని వినియోగదారులకు అందించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా హోటళ్లను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న అన్ని హోటళ్ల పరిశుభ్రంగా ఉంచాలని, కల్తీలేని ఆహారాన్ని ప్రజలకు అందించి పనిచేసే వ్యక్తులు పరిశుభ్రంగా ఉండి ఆహారం తయారు చేయాలన్నారు. పరిశుభ్రమైన నీటిని మాత్రమే వినియోగించాలని సూచించారు. హోటల్‌కు వచ్చే కస్టమర్లకు చేతులు శుభ్రం చేసుకునేటప్పుడు సబ్బును, లిక్విడ్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం పట్టణంలోని పలు హోటళ్లలో ఆహార పదార్థాలను తనిఖీ చేసి అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లకు జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఏకనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో కూడా పట్టణంలోని అన్ని హోటళ్లను తనిఖీ చేయడం జరుగుతుందని, ఎక్కడైనా అపరిశుభ్రంగా ఉన్నట్లయితే, నాణ్యతలేని ఆహారాన్ని ప్రజలకు అందించడం గమనించినట్లయితే వారికి జరిమానా విధించడమే కాకుండా కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హోటళ్ల యజమానులకు తెలియజేశారు.

కొత్తచట్టాలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బాలమద్దిలేటి

పులివెందుల రూరల్ : కొత్తచట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ సభాభవనంలో భారత న్యాయ సంహిత 100 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా లీగల్ ప్రొఫెషనల్ ఆఫీర్ సునీత, సీఐలు మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు అండగా ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ పేరును ప్రస్తుతం భారతన్యాయ సంహిత అని మారుస్తూ 358 సెక్షన్‌లను 20 అధ్యాయాలుగా చేసి 20 నేరాలను అదనంగా చేర్చడం జరిగిందన్నారు. వీటి ద్వారా కేసులు వెంటనే పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి అమలులో ఉన్న శిక్షలలో మార్పులు తెచ్చి భారత ప్రభుత్వం నేటి కాలానికి అనుగుణంగా మార్పులు, చేర్పులు చేసిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత, స్నేహిత అమతహస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి


వెల్లటూరులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ మురళీధర్‌రెడ్డి


కమలాపురంలో ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న కడప ఏడీఏ సురేష్‌రెడ్డి

పెండ్లిమర్రి : ఎరువులు, పురుగుమందుల దుకాణాదారులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయశాఖ ఏడీఏ మురళీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వెల్లటూరు, పెండ్లిమర్రి గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి ఉన్న స్టాక్, రికార్డులను పరిశీలించారు. నకిలీ ఎరువులు, పురుగు మందులు రైతులకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఎరువులు తీసుకున్న ప్రతి రైతుకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఓబులేసు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలి

కమలాపురం : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాదారులు రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని కడప ఇన్‌చార్జి ఏడీఏ సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన ఏఓ సరస్వతితో కలసి పరిశీలించారు. రికార్డులను, నిల్వ ఉన్న స్టాక్‌ను, నోటీస్ బోర్డులో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. డీలర్లు నిబంధనలకు లోబడే విక్రయాలు జరపాలన్నారు. ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని, అధిక ధరలు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా తాము కొన్న ఉత్పత్తులకు డీలర్ల వద్ద తప్పని సరిగా రశీదులు పొందాలన్నారు. అనుమతి ఉన్న దుకాణాల్లోనే మాత్రమే ఉత్పత్తులు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం డీలర్స్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం


చిన్న చెప్పలి జడ్పీ హైస్కూల్‌ను మూయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కమలాపురం : నీట్ పరీక్షలను రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి తిరిగి పరీక్ష నిర్వహించాలని వివిధ విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గురువారం కమలాపురం మండలంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం అయింది. దేశవ్యాప్తంగా జరిగిన బంద్‌లో భాగంగా కమలాపురంలో ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు చేపట్టిన బంద్‌లో భాగంగా మండలంలోని కమలాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, నల్లింగాయపల్లె, ఎర్రగుడిపాడు తదితర గ్రామాలలో పాఠశాలలకు వెళ్లి మూయించారు. ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగానే తమ పాఠశాలలకు శెలవులు ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగాన్ని విచ్ఛిన్నం చేసిందన్నారు. అందులో భాగంగానే కేంద్రం రాష్ట్రాల విద్యా హక్కులను కాలరాస్తూ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షను తక్షణం రద్దు చేసి తిరిగి నిర్వహించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నీట్ లీకేజిలపై సమగ్రదర్యాప్తు జరిపి ఎన్‌టీఏపై కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం నీట్ లీకేజిలపై దర్యాప్తు జరుపాలంటూ విద్యాసంస్థలకు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. నీట్ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్‌టీఏను పూర్తిగా రద్దుచేసి లీకేజిలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : నీట్ పరీక్షను రద్దు చేసి, ఎన్టీఏ ఏజెన్సీ సంస్థను రద్దు చేయాలని డిమాండు చేస్తూ గురువారం నిర్వహించిన బంద్ విజయవంతం అయిందని ఎఐఎస్ఎఫ్ జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి శరత్, మండలాధ్యక్షుడు లీలాకృష్ణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌టీఏ విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలలో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం అందులో ఆ విద్యార్థులందరు హర్యానాలోని ఒకే సెంటర్‌కి సంబంధించిన వారు కావడం అనేక అనుమానాలు కలిగిస్తోందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

కొండాపురంలో..

కొండాపురం : ఇటీవల నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం ఐక్య విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కొండాపురంలో పాఠశాలలను మూయించి బంద్ నిర్వహించారు.

భూ సమస్యతో పంటను దున్నేసుకున్న రైతులు

లింగాల : వెలిదండ్ల గ్రామంలో ప్రభావతి అనే మహిళకు చెందిన భూమిలో అరటి, టమోట, కంది పంటలను పక్కపొలం రైతులు ట్రాక్టర్‌తో దున్నేశారు. వివరాల్లోకి వెళ్తే సదరు భూ సమస్య గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, భూ సర్వే చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ప్రభావతికి చెందిన అరటి, టమోట, కంది పంటను పక్క పొలం రైతులు దున్నేశారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ లేకపోవడంతో ఫిర్యాదు చేయకుండానే వెనుతిరిగారు. భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సర్వే చేయించుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని పోలీసులు తెలిపినట్లు వారన్నారు.

అతిసార వ్యాధిపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసా

వేంపల్లె : తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాళ్లపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం హైస్కూల్‌లో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసా బేగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతిసార వ్యాధి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ముఖ్యంగా హ్యాండ్ వాషింగ్, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే దోమల ద్వారా వచ్చే వ్యాధులు, లక్షణాలు నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులురెడ్డి, సూపర్‌వైజర్ అరుణాదేవి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


బండను లాగుతున్న ఎద్దులు

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారి పక్కన వల్లూరు మండల పరిధిలోని కట్ట బస్టాపు వద్ద వెలసిన పాపాఘ్ని వీరాంజనేయస్వామి తిరుణాల మహోత్సవంలో భాగంగా గురువారం సేద్యపు విభాగపు ఎద్దులచే నిర్వహించిన బండ లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 10 కాండ్ల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలను కమిటీ సభ్యులు చిన్న ఓబులేసు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన ఎం.చెన్నకేశవ ఎద్దులు 2123 అడుగులు బండను లాగి మొదటి స్థానంలో నిలిచాయి. పెండ్లిమర్రి మండలం పాతసంగటిపల్లె గ్రామానికి చెందిన కే విశ్వనాథరెడ్డి ఎద్దులు 2089 అడుగులు బండను లాగి ద్వితీయ స్థానంలో, చెన్నూరు మండలం ఓబులంపల్లె గ్రామానికి చెందిన సానపురెడ్డి సతీష్‌రెడ్డి ఎద్దులు 2036 అడుగులు బండను లాగి తృతీయ స్థానంలో, ప్రొద్దుటూరు మండలం తిమ్మయ్య కాలనీకి చెందిన పాతకోట తేజేశ్వర్‌రెడ్డి ఎద్దులు 1543 అడుగులు బండను లాగి నాలుగవ స్థానంలో, వల్లూరు మండలం చెరువుకిందిపల్లె గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్‌రెడ్డి ఎద్దులు 1431 అడుగులు బండను లాగి ఐదవ స్థానంలో, వల్లూరు మండలం చెరువుకిందిపల్లె గ్రామానికి చెందిన సగిలి చెన్నకేశవరెడ్డి ఎద్దులు 1300 అడుగులు బండను లాగి ఆరవ స్థానంలో నిలిచాయి. వీరికి మొదటి బహుమతి రూ.30 వేలను మాజీ రాష్ట్ర ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి వితరణగా అందించారు. ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు, నాలుగవ బహుమతి రూ.10 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు, ఆరవ బహుమతి రూ.3 వేలను సంబంధిత దాతలు విజేతలకు అందించారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి


నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు

వేంపల్లె : భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ లోక్‌సభలో సభా సాంప్రదాయాలు పాటించకుండా హిందూవులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకి వ్యతిరేకంగా హిందూ ఐక్యవేదిక నాయకులు గురువారం వేంపల్లెలో నిరస తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా వేంపల్లెలోని నాలుగురోడ్ల కూడలిలో రాహుల్ గాంధీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా మాట్లాడుతూ రాహుల్‌గాంధీ మొత్తం హిందూ సమాజాన్ని హింసాత్మకంగా పిలిచాడని, ఇది హిందూవుల మనోభావాన్ని అవమానించడమేనన్నారు. పార్లమెంట్‌లో ప్రజల సమస్యలపైన పోరాడకుండా లేని సమస్యలని సృష్టిస్తూ భారతదేశానికి చెడ్డపేరు తీసుకు రావడం ఏ మాత్రం మంచిది కాదన్నారు. హిందూవులపైన ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ వెంటనే భారతదేశానికి, హిందూవులకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు


అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, మున్సిపల్ కార్యాలయంలో గురువారం విప్లవ వీరుడు, స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరు సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ రమణారెడ్డి, ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ అరుణ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర క్లుప్తంగా వివరించారు. అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ మనందరికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ మహిళా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధీర, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.సతీష్ తెలిపారు. గురువారం కళాశాలలో ఆయన చిత్రపటానికి విద్యార్థులు, అధ్యాపకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు దేశ స్వాతంత్ర్యానికి ప్రాణాలర్పించడం ఎంతో గొప్ప విషయమన్నారు. హిస్టరీ అధ్యాపకుడు గంగాధర్ మాట్లాడుతూ అల్లూరి జీవిత విశేషాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేశ్వరమ్మ, లైబ్రేరియన్, షఫీ ఉద్దీన్, కంప్యూటర్ లెక్చరర్ అధ్యాపక, విద్యార్థులు పాల్గొన్నారు.